క్లుప్తంగా

హుజూరాబాద్ మున్సిపల్ మేనేజర్‌గా భూపాల్‌రెడ్డి

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ మేనేజర్‌గా రావుల భూపాల్‌రెడ్డి నియామకమయ్యారు. జమ్మికుంట మున్సిపాలిటీ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడి మున్సిపాలిటీ మేనేజర్ రామ్మోహన్‌రాయ్ సిరిసిల్లకు, సీనియర్ అసిస్టెంట్లు భూమానందం, సంపత్‌రావు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. వార్డు ఆఫీసర్లు కుమార్, భిక్షపతి, శ్రీనివాస్ వేరే చోటుకి బదిలీ అయ్యారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గురువారం విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు వెంకటరమణ, రజని, అనిత సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి. శ్రీనివాస్, ఏఏపీసీ చైర్మన్ నర్మద, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

27న హుండీ ఆదాయం లెక్కింపు

చిగురుమామిడి: ఈ నెల 27న మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ ఆదాయం లెక్కించనున్నామని ఆలయ ఈఓ రాజ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్తలు, స్వామివారి భక్తులు లెక్కింపులో పాల్గొనాలని కోరారు. మే నెలలో జరిగిన స్వామివారి బ్రహ్మోత్సవాలు, అంతకు ముందు జరిగిన ముక్కోటి ఏకాదశికి సంబంధించి భక్తులు కానుకలు సమర్పించారని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని గురువారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జీల అనిల్‌కుమార్, తిప్పని సంతోష్, బొమ్మదేవి ప్రవీణ్‌కుమార్, దూలం వేణు ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామని, ఇసుక తరలింపునకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



బోనాలతో మొక్కులు చెల్లిస్తున్న విద్యార్థులు, టీచర్లు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని గార్బియన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో గురువారం సాహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో లష్కర్ బోనాలు నిర్వహించారు. పూలు, పండ్లతో మహంకాళి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. విద్యార్థులకు సంస్కృతి సాంప్రదాయలను తెలియజేసేలా బోధన ఉండాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలోపాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ అంకూస్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న యాదగిరి స్నేహితులు

చిగురుమామిడి: మండలంలోని రామంచ గ్రామానికి చెందిన కందుకూరి యాదగిరి ఇటీవల మృతి చెందాడు. యాదగిరి చిన్ననాటి మిత్రులు రూ.30 వేలు సమకూర్చి గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జక్కుల బాబు, ముంజ ప్రకాశ్, పోతరాజు మునిందర్, ములుపాల నర్సయ్య, శ్రీనివాస్, దొబ్బల కిరణ్‌కుమార్, తుంగ సదానందం ఉన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

శంకరపట్నం: సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ అన్నారు. మండలంలోని మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్లో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నామమాత్రంగా అమలు చేస్తుందని ఆరోపించారు. కల్వల ప్రాజెక్ట్ మరమ్మతు, చింతలపల్లిలో బ్రిడ్జి, కన్నాపూర్-ఏరడపల్లి బీటీరోడ్డు, అర్కండ్ల వాగుపై వంతెన, కేశవపట్నం-చెర్లపల్లి బీటీరోడ్డు, కేశవపట్నంలో రోడ్డు విస్తరణ చేయాలని తీర్మానం చేశారు. ఈకార్యక్రమంలో నర్సింహరాజు, వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, దండుకొంరయ్య ,రాజు ,శ్రీనివాస్, అశోక్ ,తదితరులు పాల్గొన్నారు.

'మానేరు' దిక్కు

- గొర్రెలు, మేకలకు మేత కష్టాలు
- స్థలాలు లేక ఇబ్బందిపడుతున్న వైనం
- ప్రభుత్వ భూములు కేటాయించాలని డిమాండ్



గొర్రెల మంద వద్ద కాపరి



మానేరు పరివాహక ప్రాంతంలో గొర్రెలు

గన్నేరువరం: మొన్నటి వరకు వేసవికాలం కావడంతో గ్రామాల్లోని రైతుల పొలాల్లో గొర్రెలు, మేకల మేతకు కాపరులు ఎలాంటి కష్టాలు పడేవారుకాదు. రోజంతా పొలాల్లో తిప్పి సాయంత్రం కాగానే ఇంటి వద్ద ఉన్న గొర్ల కొట్టంలోకి పంపించేవారు. మళ్లీ తెల్ల వారే వరకు ఎలాంటి ఇబ్బందులుండేవి కాదు. ప్రస్తుతం మానేరు పరివాహక ప్రాంతంలోకి జీవాలతో కాపరులు మకాం మర్చారు. వర్షాలు, దోమలతో అనేక ఇబ్బందులు పడుతూ కాపాడుకుంటున్నారు.

పంటలసాగుతో...

వానాకాలం కావడంతో రైతులు దుక్కులు దున్ని పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేశారు. అలాగే పొలాలను సైతం దున్ని వరి నాట్లువేస్తున్నారు. అప్పటి వరకు గ్రామాల్లో మేతకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దర్జాగా ఉండేవారు ఎప్పుడైతే పంటల సాగు మొదలుపెట్టారో జీవాలకు మేత కష్టాలు మొదలయ్యాయని కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నేరువరం, మైలారం, హన్మాజీపల్లె, గోపాల్‌పూర్ గ్రామాల పరిధిలోని ఎల్ఎండీ డ్యామ్ పరివాహక ప్రాంతానికి జీవాలతో తరలివెళ్లారు. డ్యామ్ వేల ఎకరాల విస్తీర్ణంలో ఉండటంతో పాటు ప్రస్తుతం నీరు లేకపోవడంతో అక్కడికి మకాం మార్చారు. రాత్రివేళ వాటికి రక్షణగా అక్కడే ఆవాసం ఏర్పాటు చేసుకున్నారు.

ప్రతీ గ్రామంలో యాదవ కుటుంబాలు

మండలంలోని 16 గ్రామ పంచాయతీలుండగా ప్రతీ గ్రామంలో యాదవ కుటుంబాలున్నాయి. 90 శాతం మంది యాదవులు గొర్ల, మేకల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. కుటుంబంలో ఒకరు జీవాలను కాయడానికి వెళ్తుంటారు, మిగతా కుటుంబ సభ్యులు వ్యవసాయం చేస్తుంటారు. మండల వ్యాప్తంగా 30 వేల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అన్నీ గ్రామాలకు చెందిన కాపరులకు ప్రతి ఖరీఫ్ సీజన్‌లో గ్రామాల్లో మేత కష్టాలు ఏర్పడుతుంటాయి. దీంతో గొర్రెల, మేకలతో మానేరు పరివాహక ప్రాంతానికి తరలివెళ్తుంటారు. ఈ క్రమంలో భోజనం సదుపాయం లేకపోవడంతో కాపరుల్లో ఒకరు ఉదయం గొర్రెల వద్ద కాపలా ఉండగా మిగతా వారు ఇంటికి వెళ్లి భోజనం చేసి రాత్రికి సైతం వెంట తీసుకుని మానేరు పరివాహక ప్రాంతానికి చేరుకుంటారు.

డ్యామ్ నిండితే వెనక్కి....

ప్రస్తుతం ఎల్ఎండీలో నీటిమట్టం తగ్గడంతో డ్యామ్ పరివాహక ప్రాంతంలోని పచ్చిగడ్డి జీవాలకు లభ్యమవుతోంది. ప్రస్తుతానికి వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో డ్యాంలోకి నీటి ప్రవాహం లేదు. కానీ వర్షాలు భారీ స్థాయిలో కురిసి ఎల్ఎండీ నిండితే పరివాహక ప్రాంతంలోకి బ్యాక్ వాటర్ రావడంతో మళ్లీ మేత కష్టాలు తప్పవని వాపోతున్నారు. దీంతో మళ్లీ మానేరు పరివాహక ప్రాంతం నుంచి సిద్దిపేట, శనిగరం, హుస్నాబాద్‌లోని గుట్టల ప్రాంతంలోకి వలస వెళ్తారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని రైతులు గ్రామాల్లో కొందరి రైతుల భూములను మేత కోసం కౌలుకు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఏటా ఇంతే



గ్రామాల్లో బీడు భూములు లేక గొర్రెలు, మేకలకు మేత కష్టాలు తప్పడం లేదని, ఏటా వర్షాకాలంలో మానేరు పరివాహక ప్రాంతానికి వెళ్లక తప్పని పరిస్థితి. డ్యాం నిండితే మళ్లీ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిందే. ప్రభుత్వం జీవాల మేతకు భూములు కేటాయించాలి.

– నందవేని రమేశ్, గొర్రెలకాపరి, ఖాసీంపేట

ఆరునెలలు ఇబ్బంది



రైతులు భూములు దున్ని పంటలు సాగు చేస్తుండటంతో గొర్రెలు, మేకల మేతకు ఇబ్బందులు వచ్చాయి. ఆరునెలల వరకు జీవాలను బతికించుకోవడం కష్టంగా ఉంటుంది. దీంతో మానేరు పరివాహక ప్రాంతానికి మకాం మారుస్తాం. లేదంటే ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటాం.

– మీనయ్య, గొర్రెలకాపరి, ఖాసీంపేట

సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న కేవీ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

జమ్మికుంట: రైతులు సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, ఏవో గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మడిపల్లి రైతువేదికలో గురువారం కేంద్ర ప్రభుత్వం ఫ్యాక్ట్ (ఫర్టిలైజర్ అండ్ కెమికల్ ట్రావెన్ కోర్ లిమిటెడ్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ప్రోగ్రామ్ ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంటలసాగులో చేపట్టాల్సిన పద్ధతులు, తెగుళ్ల నివారణ చర్యలు వివరించారు. రైతుభరోసా, రైతుబీమాకు రైతులు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. రైతులు నేల ఆరోగ్యం పెంపొందేలా పోషక యాజమాన్యం, రసాయనేతర పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పురుగు మందుల పిచికారీ సమయంలో రక్షణ దుస్తులు ధరించాలని, బయోఫర్టిలైజర్స్, నానో యూరియా వినియోగించాలని, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. రైతులు, రైతు కూలీలు వర్షాకాలంలో వ్యాధుల బారినపడకుండా దోమ తెరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్యాక్ట్ జోనల్ మేనేజర్ రవీందర్, రైతు ప్రగతి చైర్మన్ మహేందర్, ఏఈవో రామ్‌ప్రసాద్, సీఈవో సాగర్, బీసీఐ సిబ్బంది రఘు, రమేశ్, డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బీమా పథకాలు వినియోగించుకోవాలి

చొప్పదండి: ప్రజలు పోస్టల్‌బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్, మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. మండలంలోని ఆర్నకొండలో గురువారం తపాలా శాఖ ఆధ్వర్యంలో వివిధ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నార్త్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు మేనేజర్ రాజేశ్, ఐపీబీపీ అసిస్టెంట్ మేనేజర్ రేవతి, మల్లేశం, శేఖర్, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, గొల్ల గట్టయ్య, ఎల్లాల ఆదిరెడ్డి, జక్కుల అనిల్‌కుమార్, కేతిరెడ్డి మణిశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలుచేస్తుంది

ఇల్లందకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు నెరవేరుస్తుందని పార్టీ సీనియర్ నాయకుడు వంగ రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఆర్థికశాఖమంత్రి భట్టి విక్రమార్క అన్నివర్గాల ప్రజలకు సమతుల బడ్జెట్ కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.నాలుగు వేల కోట్లు కేటాయించి బీసీ రుణాలు ఇస్తామని మభ్యపెట్టిందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూసి బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మోతె మహేందర్‌వర్మ, రావుల రాజబాబు, రావుల ఎల్లయ్య, మురారి రాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సంపత్‌రావు, భాస్కరాచారి, జీడీ మల్లేశ్, నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, రంగు భాస్కరాచారి అన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేశ్ ఆధ్వర్యంలో గురువారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... ఆరు గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్, కోరే రవీందర్, ఠాగూర్ రాజేశ్, రాకేశ్, పల్లపు రవి, దొంతుల రాజకుమార్ కొలకాని రాజు, మోతె స్వామి, తూడి రవిచందర్‌రెడ్డి, ఇటుకాల స్వరూప, ఎదులాపురం అశోక్, కొమ్ము అశోక్, పత్తి జనార్దన్ రెడ్డి, గండికోట సమ్మయ్య, మోడెం రాజు, రాకేశ్ బూత్ ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీభక్తాంజనేయస్వామి ఆలయానికి గ్రానైట్

జమ్మికుంట: మున్సిపల్ పరిధి మోత్కులగూడెంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయానికి కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రూ.లక్షకుపైగా విలువ చేసే గ్రానైట్‌ను సమకూర్చారు. సహకరించిన పొనగంటి రవికుమార్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, రావుల మహిపాల్, పొనగంటి రమేశ్, సంపత్, కడెం సురేశ్, తిరుపతి, సతీశ్, సురేశ్, మహేందర్, ఉదయ్‌భాస్కర్, ఆకుల పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న గంగిశెట్టి రాజు

హుజూరాబాద్: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు అన్నారు. పట్టణంలో గురువారం పార్టీ పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోదీ సుస్థిర పాలన అందిస్తున్నారని, ఎంపీ బండి సంజయ్‌కుమార్ గెలుపునకు కృషిచేసిన కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కష్టపడి పనిచేసి అత్యధిక సీట్లు గెలుచుకోవాలని కోరారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సైతరం ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని, దళితబంధు రెండోవ విడత వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు జెల్ల సుధాకర్, సీనియర్ నాయకులు, మెరుగు రాజిరెడ్డి, కేసరి శేషయ్య, నల్ల సుమన్, గూడూరు రాంరెడ్డి, గూడూరు మల్లారెడ్డి, పోతుల సంజీవ్, పల్లె వీరయ్య, తుర్పాటి రాజు తదితరులు ఉన్నారు.

భట్టి బడ్జెట్ వట్టిదే

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: కాంగ్రెస్ ప్రభుత్వం తరుపున అసెంబ్లీలో గురువారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ వట్టిదేనని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. బడ్జెట్‌లో దళితబంధు పథకంతోపాటు గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన ఊసే లేదన్నారు. విద్యావ్యవస్థ, యువత, మహిళా రంగాలకు సంబంధించి బడ్జెట్ కేటాయించలేదన్నారు. తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటే అడియాశలయ్యాయన్నారు. సాగు రంగాన్ని సైతం విస్మరించారని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ దళిత, గిరిజన బడుగు, బలహీన వర్గాల వ్యతిరేక బడ్జెట్‌గా ఉందన్నారు.

నేత కార్మికుల నిరాహార దీక్ష



గంగాధర: పని కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గర్శకుర్తి గ్రామంలో చేనేత కార్మికులు గురువారం రిలే నిరాహార దీక్షను చేపట్టారు. రెక్కాడితేగాని డొక్కాడని తమకు కొద్ది రోజులుగా పనిలేక పస్తులుండే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరల ఆర్డర్ ద్వారా పని కల్పించి ఆకలి చావుల నుంచి గట్టెక్కించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పని కల్పించి ఆకలి చావుల నుంచి కాపాడాలని కోరారు. రిలే నిరాహార దీక్షలో కార్మిక నాయకులు గడ్డం నారాయణ, అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు వనమహోత్సవంలో భాగంగా గురువారం వివిధ రకాల మొక్కలు నాటారు. చెట్లు వల్ల కలిగే ప్రయోజనాలను కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయరావు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శరత్‌బాబు, కరుణ, టి. రమేశ్, శ్రీనివాస్, ఎ.రమేశ్‌బాబు, మంజుల, లలిత, సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి స్టడీ చైర్స్ వితరణ



స్టడీ చైర్స్, ప్యాడులు బహూకరిస్తున్న దాతలు సుజిత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు

చొప్పదండి: పట్టణంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు, పాఠకులకు సౌకర్యంగా ఉండేందుకు పలువురు దాతలు గురువారం స్టడీ చైర్స్ బహూకరించారు. చొప్పదండితో పాటు పరిసర గ్రామాలకు చెందినవారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడానికి గ్రంథాలయానికి వస్తుండటంతో కుర్చీలు సరిపోక అసౌకర్యానికి గురవుతున్నట్లు గ్రంథాలయ నిర్వాహకుడు బానోతు కిషన్ తెలిపారు. సీపెల్లి లచ్చమ్మ జ్ఞాపకార్థం కుమారులు వీల్‌చైర్లు, గుర్రం ఎల్లారెడ్డి ట్రస్టు ద్వారా సభ్యులు గుర్రం సుజిత్‌రెడ్డి, కాట్నపల్లి మధుసూదన్‌రెడ్డి స్టడీ చైర్లు, ప్యాడులు విరాళంగా అందించారు. ఈసందర్భంగా నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న నాయకులు ప్రభాకర్‌యాదవ్, రాంకిషన్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు

రామడుగు: రామడుగు సమీపంలోని మోతె వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పాత వంతెనపైన బీజేపీ మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని నినాదాలు చేశారు. పాతవంతెన కూలిపోయేలా ఉందని నూతన వంతెన ప్రారంభానికి నోచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్‌యాదవ్, జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, బండ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీపీ మోడీ ర వీందర్, మాజీ సర్పంచ్ ఉమ్మెంతల అభిషేక్‌రెడ్డి, నాయకులు పోచంపల్లి నరేశ్, పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్, అంజిబాబు, కుమార్, స్వామి, అశోక్, జితేందర్, భాస్కర్, మల్లేశం, లక్ష్మణ్ పలువురు పాల్గొన్నారు.

నో రిపేర్..

- కొండాపూర్‌లో పనిచేయని సీసీ కెమెరాలు
- విరాళాలతో ఏర్పాటు, పట్టించుకోని అధికారులు



సీసీ కెమెరాల కంట్రోల్ రూం

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఏడాదిగా పనిచేయడంలేదు. దీంతో గ్రామంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువకులు, ఇతర దాతలు డబ్బులు పోగుచేసి దాదాపు రూ.70 వేలు అప్పటి ఎస్సై దాస సుధాకర్‌కు అందించగా గ్రామ పరిధిలో తొమ్మిది, గంగిరెద్దుల కాలనీలో ఏడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా మరమ్మతులను పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఏడాదికే పనిచేయకపోవడంతో విరాళాలకు ప్రయోజనం లేదని, స్పెషల్ ఆఫీసర్ ఈ విషయంపై దృష్టి సారించవడం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. ఇదే అదునుగా గ్రామంలో అలజడి నెలకొంటుందని, ఇప్పటికైనా ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీసు ఉన్నతాధికారులు మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలని వినతి



వినతిపత్రమిస్తున్న సంజయ్, తదితరులు

శంకరపట్నం: కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌కు మరమ్మతులు చేయాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి సుధాకర్‌కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్‌కుమార్ గురువారం వినతిపత్రం అందించారు. పోలీస్‌స్టేషన్ నిర్మించి 30 ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కొంరయ్య, కోటి, శంకర్ ఉన్నారు.